*అశాంతార్ద్ర రాగంబులంబాడిన జేబున్నీసా ప్రేమ కథ! చక్రవర్తి కూతురైనా బికారిలా చెరసాలపాలై జీర్ణమైన బ్రతుకిడ్చింది???*

# జేబున్నీసా ప్రేమ కథ

'లత



"నా కాళ్ళకు ఎంతకాల మీ సంకెళ్ళు మృత్యువుతోనేనా నా స్వేచ్ఛ."

ఇవే ఆమె నోటినుంచి ఆఖరిసారిగా వచ్చిన మాటలు. 1702వ సంవత్సరం మే నెల 26వ తేదీన చెరసాలలో మరణించింది. ప్రేమించింది. తండ్రిచేత జైల్లో బంధించబడింది. ప్రియుడి చావు కళ్ళారా చూసింది. రాణివాసంలో గడపాల్సింది రాళ్ళ శాలలో గడిపింది. రాచ మర్యాదలతో సమాధికి చేరవలసింది బికారి రూపంలో చేరింది. ప్రేమించడమే స్వయంకృతాపరాధమై ప్రేమకు ఈ లోకంలో చోటులేదని పరలోకానికి వెళ్ళిపోయింది మొగలు చక్రవర్తి ఔరంగజేబు గారాలపట్టి జేబున్నీసా.

సన్నగా పొడుగ్గా అతి నాజూగ్గావుండే విగ్రహం. పొడుగ్గా నల్లగా నిగనిగలాడే కురులు. సుందర రూపంతోపాటు అతి మధురమైన స్వరం. జేబున్నీసాకు ఔరంగజేబు తండ్రే అయినా ఆమెకుఅన్నీ తల్లిలక్షణాలే. ఔరంగజేబు చర్యల్ని చిన్నతనం నుంచీ అసహ్యించుకుంటూనే వుండేది. అందుచేతనే అందగాడూ సరళస్వభావుడైన అకిల్‌ఖానుని మొదటి చూపులోనే ప్రేమించింది. అకిల్‌ఖాన్ యువకుడు ధైర్యవంతుడు అందగాడు లాహోరు గవర్నరు.

జేబున్నీసా ఒంటరిగా తన గదిలో కూర్చొనివుంది. గది చుట్టూ తెరలు దించబడి వున్నయ్. గదిలోనే ఒకమూల టేబుల్ మీద ఇత్తడి దీపపు కెమ్మెలో వత్తి మండుతోంది. గదంతా కాంతిగా వుంది. గదిలో వున్న జేబున్నీసా కళ్ళు మూసుకుని ఏదో ఆలోచిస్తోంది. ఆమె కనుబొమ్మల పై భాగంలో నుదురుమీద ఒక సన్నని రేఖ కనపడీ కనపడనట్లుగా ఏర్పడింది. ఆమె ఆలోచన గతంలోకి తొంగి చూసింది.

ఒకసారి తండ్రి మొగల్ సామ్రాట్టు ఔరంగజేబుతో పాటు లాహోరు బయలుదేరింది. లాహోరు సమీపంలోకి రాగానే ఏదో కలకలం వినిపించింది. ఏమిటో చూడాలనే కోరికతో అలంకారాలతో నిండివున్న చేత్తో పల్లకీ తెర కొద్దిగా తొలగించి తొంగిచూసింది. తన కళ్ళనే నమ్మలేకపోయింది. తన తండ్రి పట్టపు ఏనుగును దిగి ఎదురుగావస్తున్న ఆజానుబాహువు, సుందరరూపుడైన యువకుణ్ణి కౌగలించుకున్నాడు. ఇది ఆమెకు చాలా ఆశ్చర్యం కలిగించింది. తన తండ్రి ఏనుగు దిగి ఒక యువకుణ్ణి కౌగలించుకోవడమా.... ఆ యువకుడు తన తండ్రికంటే పొడగరి. తండ్రి అతడి భుజాల దగ్గరకు వచ్చాడు. అలాంటి

సందర్భాల్లో తప్ప తండ్రిని యిష్టపడేది కాదు. ఆ యువకుడి చూపు హఠాత్తుగా ఆమె వైపు నిలిచింది. రెండు చూపులు ఒకచోట కలిశాయి. మెరుపు మెరిసింది జేబున్నీసా మానసమందిరంలో.

అకిల్ ఖాన్ ఔరంగజేబు బాహుబంధం నుంచి విడివడి సలాము చేస్తూ వెనక్కు అడుగులు వేశాడు జేబున్నీసాను పరిశీలిస్తూ.

అకిల్ ఖాన్ పేరు వినటమేకాని ఇంత వరకూ చూడలేదు. ఎంతటి అందగాడు. తనతండ్రికి నచ్చినవాడు.తండ్రికి చెపితే.

లాహోరు రాజమందిరంలో విడిది చేసింది. చెలికత్తెలు చెలిమి కూర్చారు సుందరుడైన లాహోరు గవర్నరుతో.ప్రతి రోజూ కలుసుకోటాలు ఏర్పాటు అయినాయి. ప్రతిరాత్రి వెన్నెల రాత్రులే అయినాయి. భయంతో, ఆత్రంతో, ఆనందంతో గడిపారు.

"అమ్మో, తండ్రికి తెలిస్తే...." ప్రతి సారీ ప్రతి నిమిషమూ భయమే.

తండ్రి సంగతి తనకంటే ఎవరికీ తెలియదు.

ఒక రోజున అడిగింది.

"చక్రవర్తి అంటే భయంలేదా?"

ఆమె విశాలమైన మిణుకుమిణుకుమంటూ వుండే కళ్ళవైపు ఆలోచనగా చూస్తూ.

"నీ కళ్ళకంటేనా.... నువ్వు నా దానివైతే చాలు. దేన్నయినా ఎదుర్కొంటాను."

ఒక్కసారి తండ్రిరూపం ఎదుట ప్రత్యక్షమయినట్లయింది. ఒణికిపోయింది. రక్తం చల్లబడి గడ్డకట్టుకుపోయింది. ఈ ప్రేమ కొనసాగేనా? నా వలపుల స్వామి నాకు నిలిచేనా," అని ప్రశ్నించుకుంది నిట్టూరుస్తూ.

అకిల్ ఖాన్ ఆమెను గట్టిగా హృదివి పట్టుకొని "భయపడకు జైబ్.... నా ప్రేమను శంకిస్తున్నావా.... అల్లామీద ఒట్టు...."

తిరుగు ప్రయాణం దగ్గరబడ్డది. వారి శరీరాలు దూరమయ్యేకాలం ఆసన్నమయింది. రేపే ప్రయాణం.యింతవరకూ ఓదార్పడం అకిల్ వంతు అయింది. ఇప్పుడు జేబున్నీసా వంతయింది.

గొంతుక్కు ఏదో అడ్డం పడ్డట్టయింది. మాటలు రావటంలేదు ఎక్కిళ్ళు తప్ప. చివరికి ఎట్లాగో,

"అకిల్-మన ప్రేమ శాశ్వతమయినది. ఈ లోకంలో కాకపోయినా,మరో లోకంలోనైనా మనం కలుసుకుంటాము. నా తండ్రిని ఒప్పిస్తాను. మన పెళ్ళి జరిపిస్తాను. జరగనినాడు.... సెలవు తీసుకుని తన విడిదికి బయలుదేరింది. తండ్రిని ఒప్పించటము జరుగుతుందా అనుకుంటూ. కాళ్లు చేతులు ఒణకడం ప్రారంభించినయ్. వరండాలో స్తంభాన్ని గట్టిగా పట్టుకోబోయింది. పట్టుకునేలోపలే స్తంభం విరిగి నెత్తిన పడినట్లనిపించి భయం వల్ల స్పృహతప్పి కింద పడిపోయింది. ఔరంగజేబుకు వార్త పంపారు. వైద్యు లొచ్చారు. విశ్రాంతి అవసరమన్నారు. అనుమానించని ఔరంగజేబు కూతురు బాధ్యత అకిల్ ఖానుకు అప్పగించి ఢిల్లీకి తిరుగు మొగమైనాడు.

అలంఘీరు కదలగానే ఈ జంటకు ఆట విడుపయింది. స్వేచ్ఛగా తిరగడం ప్రారంభించారు. రాబోయే ప్రమాదాన్ని గురించి ఆలోచించే వ్యవధి లేకపోయింది. వార్తలు ఔరంగజేబుకు చేరినయ్. హుటాహుటిన లాహోరు చేరాడు.

ఔరంగజేబు కూతుర్ని ఏమీ అనలేదు. ఢిల్లీకి ఆఘమేఘాల మీద చేర్చాడు. పెళ్ళి సంబంధాలు తెచ్చాడు. జేబున్నిసా అంగీకరించలేదు. అకిల్ ఖానుని తప్ప మరొకర్ని చేసుకోనన్నది.

ఔరంగజేబు కోపం నెత్తికెక్కింది, అకిల్ ఖానును యీడ్చుకు రమ్మన్నాడు. ఈ సంగతి తెలిసిన అకిల్ ఖాన్ పలాయనం చిత్తగించాడు. జేబున్నీసా తండ్రి ముందు నిరుత్తరురాలయింది. కోపంతో పిచ్చెక్కింది. అకిల్ ఖాన్ మోసగించాడని రూఢి చేసుకుంది.


శ్రీ రవి ట్రేడర్స్ [సిని పదావళి-2] మండపేట-533 308

రు. 25,000 లు గెలుపొందండి !

ఆల్ కరెక్టు రు. 20,000లు 1. 2 తప్పులు రు. 5,000లు

1 ఎంట్రీ రు. 1–00, 10 ఎంట్రీలు రు. 5–00, 25 ఎంట్రీలు రు.10–00

ముగింపు తేదీ : 21-2-77 కీ సొల్యూషన్ : 27-2-77 ఆంధ్రజ్యోతి డైలీలో

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | | | కు | మా | రి |
| 2 | జ | య | | | | × |
| 3 | | | | శ్రీ | × | × |
| 4 | | | | రా | వు | × |
| 5 | | | | బా | బు | × |
| 6 | | | | రా | జు | × |

నిబంధనలు : 1. ప్రక్క గడులలో 1 నుండి 3 వరకు నటీమణుల పేర్లు, 4 నుండి 6 వరకు నటుల పేర్లు అసంపూర్తిగా ఇవ్వబడినవి. మీరు ఊహించిన ఆ 6గురి పేర్లు వరుసగా తెల్ల కాగితముపై వ్రాసి పంపండి. 2. రుసుము క్రాస్ చేయని I.P.O. ద్వారాగాని, M.O. ద్వారాగాని పంపుతూ M. O. రశీదు తప్పక జతపర్చాలి, 3. M. O. రశీదు లేని ఎంట్రీలు ముగింపు తేదీ దాటిన తరువాత చేరు ఎంట్రీలు పోటీకి స్వీకరించబడవు. ఒకరు ఎన్ని ఎంట్రీలు అయినా పంపవచ్చును. 4. మేనేజిమెంటువారిదే తుది నిర్ణయం. 5. స్టేట్ బ్యాంక్ లాకరులో సీలు చేయబడి గ్రామాధికారుల సమక్షంలో తెరువబడే కీసొల్యూషన్‌తో సరిపోలని ప్రతీ మాట ఒక తప్పుగా లెక్కించబడును. 6. విజేతల లిస్టు, పోటీ నెం–3 ఎంట్రీలకు 40 పైసల స్టాంపులు పంపండి. మీ ఎంట్రీలు, M. O.లు ఈ దిగువ అడ్రసుకే పంపండి.

SRI RAVI TRADERS, MANDAPETA-533 308.

రోజులు గడిచినయ్. ఔరంగజేబు ఈ స్వల్ప విషయాన్ని మరచిపోయాడు. సైన్యాలు సమీకరించాడు ఎదురుతిరిగిన తన అన్నకొడుకు నాల్గవవాడు అక్బరు మీదికి.

రహస్య సమాచారం అందింది. అకిల్ ఖాను తన అన్న అక్బరుతో చేయి కలిపాడు. విప్లవం లేవదీయించాడు.

"అల్లా దయవల్ల ఈ విప్లవం వర్ధిల్లాలి: తన ప్రియుడు తనకు దక్కుతాడు. అకిల్ తనవాడు. మోసం చెయ్యలేడు" అనుకుని కొంత తృప్తి చెందింది జేబున్నీసా.

విప్లవం విఫలమయింది. అక్బరు గతి అధోగతి అయింది. ఎదురు తిరిగినవాళ్ళను నిర్దాక్షిణ్యంగా వధించాడు అలంఘీరు.

కానున్నది కాకమానదు అని విధిని తలుచుకుని వైరాగ్యంలోకి దిగింది. కవిత్వం ప్రారంభించింది. అదొక్కటే ఆహార మయింది. నమాజు జోరయింది. బ్రతుకు అశాశ్వతమని....ప్రేమలు....

సంవత్సరం క్షణంలో పారిపోయింది. రాత్రిళ్ళు పొద్దెక్కువయింది. నిద్ర కరువయింది. ఒక రాత్రి నిద్రపట్టలేదు. గాలి రాక తెరలు తొలగించింది. అయినా వేడిగాలి....పన్నీరు ఒంటిమీద చిలకరించుకుంది. కిటికీకి ఆనుకొని దూరంగా కనిపిస్తున్న యమునానదివైపు చూసింది. యమునలో నీళ్ళు చంద్రబింబం వల్ల వెండిలా తళతళలాడుతున్నాయ్....

అక్కడ ఎంతసేపు నిలబడిందో తెలియదు. దూరాన మల్లెపొదల దగ్గర అలికిడి అయింది. అక్కడ చీకటి అల్లుకుంది. చీకట్లోకి చీల్చి చూసింది. ఎవరో పురుషుడు నిలిచినట్లయింది. నోటమాట రాలేదు. ఆ రోజుల్లో ఆ సమయాల్లో ఏమైనా జరగవచ్చు.

ఆ వ్యక్తి జేబున్నీసావైపు కదులుతున్నాడు. ఆమె కదల్లేక రాయిలాగా నిలబడ్డది. అతడు ఆమెను సమీపించి "జైబ్" అని రహస్యంగా పిలిచాడు.

గొంతు కడ్డంపడ్డ వుండ మింగలేక స్థాణువయింది. తన కళ్ళను తాను నమ్మలేక పోయింది. కళ్ళు మూసుకుని తెరిచి మళ్ళీ మళ్ళీ చూసింది. కళ్ళనిండా నీళ్ళు చెంపలమీదుగా కారుతున్నయ్.

"ఏడవకు జైబ్. నన్ను పైకిలాగు" అనీ గుసగుసలుగాఅన్నాడు అకిల్ ఖానుడు.

జేబున్నీసా తన గదిలోకి పరుగెత్తి ఒక దుప్పటి తాడుగా చుట్టి ఒక వైపు అందించింది. రెండోవైపు కిటికి కడ్డీకి కట్టింది.

రెండు క్షణాల్లో ఆమె ప్రక్కకు పాకి వచ్చాడు. ఆమె హృదయంలోంచి ప్రవాహం బయటికి వచ్చింది. అతణ్ణి పెనవేసుకుపోయింది.

తిరిగి కలుసుకున్నారు ప్రేమికులు. ఉద్యానవనంలోకి వచ్చిన కొత్త తోటమాలిని ఎవరూ గుర్తుపట్టలేకపోయినారు.

ఏ క్షణం ఎటువంటిదో అని ఆమె సర్వస్వాన్ని అతనికి ధారపోసింది. ఈ ప్రేమకు రక్షణ లేదుగదా....

"ఇక్కడ మన కలయిక లాహోరులో కంటె వెయ్యిరెట్లు ప్రమాదమయింది. ప్రియా" అంది జేబున్నీసా.

తల తీవిగా ఆడించాడు ఆమెని తనలోకి పొదువుకుంటూ. తలుపు చప్పుడయింది. జేబున్నీసా గుండె ఆగిపోయింది. అకిల్ ఖాను ముఖం తెల్లబారిపోయింది. ఆమె వంక ప్రాధేయ పూర్వకంగా చూచాడు.

"నన్ను రక్షించు" అని దీనంగా ప్రార్థించాడు.

అటుయిటుచూసి గదిలో ఒక మూల ఎత్తైన ఇత్తడి కూజా చూపించింది. రెండంగల్లో దాంట్లోకి దూరాడు ప్రాణ భయంచేత అకిల్ ఖాన్ అంతకంటే మరో మార్గంలేక.

మేలి ముసుగు సరిచేసుకుని తలుపుతీసి అర్ధరాత్రి తండ్రినిచూసి సలామ్ చేసింది.

"అబ్బా హుజూర్! యింత అర్ధరాత్రి సమయంలో వచ్చారు?" అని అంది.

చురుకైన ఔరంగజేబు కళ్ళు గదంతా తిరుగుతున్నాయ్.

"ఆలీజా! లోపల కురండి" అని స్వాగతం పలికింది మరోసారి.

నెమ్మదిగా, ఠీవిగా, అడుగులు వేస్తూ కూతురు గదిలోకి వచ్చాడు. తలెత్తి కూతురువంక సూటిగా చూశాడు. ఆ చూపు భరించటం ఎంతటి వాడికైనా కష్టం.

"నా ముద్దుల కుమార్తెగారు యింత అర్ధరాత్రి మేలుకుని ఏమిటో చేస్తున్నారు?" అని పేల్చాడు మొదటి బాంబు. అతినెమ్మదిగా "ఖురాను పఠిస్తున్నాను ఆలీజా" అని మృదువుగా సమాధానమిచ్చింది. అతని కూతురైన జేబున్నీసా.

మెల్లిగా మరొకవైపుకు తిరిగి ఇత్తడి కూజావంక చూస్తూ.

"ఇది యిక్కడ ఎందుకు పెట్టించావు?" అని ప్రశ్నించాడు. ఆమె చూపులే ఆమెను కుట్టటం ప్రారంభించినయ్. గొంతులో పచ్చి వెలక్కాయ గుజ్జు అడ్డం బడ్డది. గుటకేస్తూ "నీళ్ళు పోయించి కాళ్ళు చేతులు పరిశుభ్రం చేసుకోవడానికి వుంచాను" అంది. అతి దీనంగా, ప్రార్థనా పూర్వకంగా ఉన్నాయి ఆమె చూపులు.

ఔరంగజేబు చూపులు తీవ్ర మయినయ్, "ఈ సమయంలో చన్నీళ్ళు వాడుతున్నావా వెంటనే వేడినీళ్ళు కాయించు" అని హుకుం చేయించాడు.

ఒక్కసారి తండ్రివైపుమాసి తల దించుకుని కూడగట్టుకొని తెచ్చుకున్న ధైర్యంతో.

'మీ ఆజ్ఞ ప్రకారం అలానే చేయిస్తాను' అంది.

సేవకులు ఎత్తి ఇత్తడి కూజాను మంట మీద పెట్టారు.

ఒకవైపు నిశ్చయంగా, నిశ్చలంగా చూస్తూవున్నారు ఔరంగజేబు. మరోవైపు స్తంభానికానుకొని కదలకుండా – అరవకుండా నిశ్శబ్దంగా మరణవేదన అనుభవిస్తున్న తన ప్రియుణ్ణి గురించి ఆలోచిస్తోంది. మంట పెద్దది చేశారు. నీళ్ళు మరుగుతున్నాయ్....

* * *

జేబున్నీసా ఉద్యానవనంలో అకిల్ ఖాన్ సమాధి ప్రక్కన కూర్చుని వుంది.

వార్ధక్యం గుర్తుకొచ్చింది. తనకు వయస్సు రాలేదు. వార్ధక్యం వచ్చింది. ఎన్నాళ్ళుండాలో "వార్ధక్యమా! తొందరగా.

నువ్వొచ్చేదాకా నేనుండాలిగా........"

ఏమైనావు ప్రియతమా నా ప్రియతమా ఈ లోకపు బూటకపు ప్రేమకు బలైనావు గదా!

నువ్వుండు నేనొస్తా నిజం చేస్తాను. ★

300 గుళ్ళు ఉచితం

జర్మన్ మోడల్ పిస్టల్

(లైసెన్సు అవసరంలేదు)




ఏభై గుళ్ళ పిస్టలు. గట్టిది మరియు తక్కువ బరువు కలది. దొంగల బారినుండి మరియు క్రూరమృగముల బారి నుండి మిమ్ములను రక్షించు... పిక్ నిక్, ప్రయాణం మరియు నాటకం మొ॥ వాటికి ఉపయోగపడుతుంది. జర్మన్ మోడల్ 007 ధర రు. 25/-, లెదర్ కేసు రు. 8/-. 300 గుళ్లు ఉచితం. అదనపు గుళ్లు వందకు రు.2/-. పోస్టేజి, ప్యాకింగ్ ఖర్చులు రు. 8/-.మీ ఆర్డరును ఇంగ్లీషులో ఉన్న మీ పూర్తి చిరునామాతో పంపండి.

PARAGON TRADERS (WAJ)
F-2/1, Krishan Nager, Delhi-110051.